ఇంటర్వ్యూ



చిత్తూరు పార్లమెంటు బరిలోకి హఠాత్తుగా ప్రవేశించారు ఆయన. అయితే ఆ నిర్ణయం మాత్రం హఠాత్తుగా తీసుకున్నది కాదు. ఉన్నతోద్యోగిగా సుదీర్ఘకాలపు అనుభవం.. లాభదాయకమైన సంస్థ నిర్వహణలో పొందుతున్న సంతృప్తి.. ఊరిని వేదికగా చేసుకుని చేస్తున్న సేవా కార్యక్రమాలు.. వీటి నుంచి పుట్టిన ఆలోచనే ఆయనను రాజకీయాల్లోకి నడిపింది. ప్రజాసేవకు అధికారం బలమైన ఆలంబన అవుతుందంటూ కుమారుడు ఇచ్చిన సూచన ఆయన్ను చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దించింది. నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ, ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, పరిష్కార లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ప్రయాణం సాగిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పంచుకున్న అంశాలు ఇవి...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చంద్రబాబు విజన్ చూసే రాజకీయాల్లోకి..

టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్

టీడీపీలో చేరేందుకు కేవలం చంద్రబాబే కారణం. దశాబ్దాలుగా ఆయన్ను, ఆయన పాలనను, అందులో ఆయన విజన్‌ను చూస్తున్నా. విజన్ 2020 అని చంద్రబాబు అన్నప్పుడు అందరూ నవ్వారు. దాన్ని ఆయన నిజం చేసి చూపించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాఫ్ట్‌వేర్ రంగంపై ఆధారపడనుందని అప్పట్లోనే గుర్తించి హైటెక్ సిటీని అభివృద్ధి చేశారు. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో చంద్రబాబును మించినవారు లేరు.

చిత్తూరుకు చంద్రబాబే పంపించారు..

బ్యాంకు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు నేనూ టీడీపీ పార్టీలో చేరుతానని నా ప్రొఫైల్ అందించాను. చంద్రబాబు నుంచి ఎలాంటి హామీ పొందకుండానే నా సొంత పార్లమెంటు నియోజకవర్గం బాపట్లలో టీడీపీ కోసం గట్టిగా పనిచేశాను. నాకు లభిస్తున్న ఆదరణ చూసి పోటీ చేద్దామనే నమ్మకం కలిగింది. ఆ తర్వాత చంద్రబాబును కలిసి బాపట్ల ఎంపీ టికెట్ అడిగాను. ఆయన నన్ను చిత్తూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేయమని పంపించారు.

రాజకీయాల్లోకి వచ్చినవారి మీద ప్రజలకు ఒక బలమైన అభిప్రాయం ఉంటుంది. అదేంటంటే.. వీళ్లు డబ్బులు సంపాదించుకోవడానికే వచ్చారని. నాకు ఆ అవసరం లేదు. ఉన్నత ఉద్యోగిగా హోదా అనుభవించాను. డబ్బులు చూసేశాను. నా మీద ఆధారపడినవారు లేరు. కొడుకు స్వతంత్రంగా ఎదిగాడు. ప్రజలకు మంచి చేద్దామనే ఒకే ఒక్క ఆలోచన నాది. ఆచరణకు అధికారం బలాన్నిస్తుందనే నమ్మకంతోనే ఎంపీగా పోటీ చేస్తున్నాను.

అనేక ప్రాంతాల్లో అధికారిగా..

ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటులో హైదరాబాద్, మహబుబ్‌నగర్, నల్గొండ, పూణె, ఔరంగబాద్, లాతుర్, ఉస్మానాబాద్, నాందేడ్, బెంగుళూరు, గుల్బర్గా వంటి ప్రాంతాల్లో పనిచేశారు. మూడేళ్ల సర్వీసు ఉండగానే గుల్బర్గాలో ముందస్తు పదవీ విరమణ తీసుకున్నాను.

'పే బ్యాక్ టూ సొసైటీ'

మూడు నెలల కిందట వరకూ కూడా నేను రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. 'పే బ్యాక్ టూ సొసైటీ' అనే మాట సర్వీసులో చేరినప్పటి నుంచీ నా మనసులో నాటుకుపోయింది. మా గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, లైబ్రరీ ఏర్పాటు, అనారోగ్యంతో బాధపడేవారికి, అవసరమున్నవారికి ఆర్థిక సాయం చేయడం వంటివి చేసేవాడిని. చదువుకున్న వారికి శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు వచ్చేలా చేసేవాడిని. అలా ఉద్యోగాలు పొందినవారిలో సుమారు 20 మంది ఉన్నత హోదాల్లో ఉన్నారు. 2009లో ఓ అబ్బాయికి రూ.7 వేల జీతానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించాను. ఇప్పుడతను రూ.3.50 లక్షల జీతాన్ని డ్రా చేస్తున్నాడు. నేను ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా ఉన్నప్పుడు పెద్ద పెద్ద పరిశ్రమలతో సంబంధాలుండేవి. వాటి ద్వారా నేను ఉద్యోగాలకు సిఫార్సు చేసేవాడ్ని.

సేవ కోసం రాజీనామా

చిన్న స్థాయిలో చేసే సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేందుకే ఉద్యోగానికి రాజీనామా చేశాను. అప్పటికే నా కొడుకు రాధే నిర్మాణ రంగంలో మంచిగా స్థిరపడి ఉన్నాడు. అతన్ని సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవ్వమని చెప్పాను. గజియాబాద్ ఐఎంటీ బిజినెస్ కాలేజీలో చదివిన ఆయన బయటికి వచ్చిన వెంటనే వ్యాపారం చేస్తానన్నాడు. నా నుంచి ఆర్థిక అండ కూడా లేకుండానే స్వతంత్రంగా నిర్మాణ రంగంలో అడుగు పెట్టి ఇప్పుడు పెద్ద స్థాయిలో స్థిరపడ్డారు. ఉద్యోగం మానేసి తన నిర్మాణ కంపెనీలోకి రమ్మని రాధే నన్ను ఆహ్వానించారు. రాజీనామా చేశాను. ఇప్పుడు మా సంస్థ మంచి పురోగతి చెందింది.

ఐదేళ్లలో రాజధాని ఎలా సాధ్యం

సాధారణంగా ఓ కొత్త రాజధాని నిర్మాణానికి 25 నుంచి 30 ఏళ్లు పడుతుంది. డిజైన్ ఆరేడు ఏళ్లు, నిర్మాణానికి 20-25 ఏళ్లు అవసరం. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్, ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రా నగరాల నిర్మాణం ఓ ప్లాన్ ప్రకారం జరిగింది. అలాంటిది మన రాష్ట్రనూ తన రాజధాని అమరావతిని నాలుగైదు ఏళ్లలో నిర్మించలేదని ఆయన్ను దించేశాం. మనమంతా విజ్ఞతతో ఆలోచించలేదు. ఇదే అదనుగా కొత్త సీఎం మూడు రాజధానులు అన్నారు. చివరికి రాష్ట్ర ప్రజలంతా రాజధాని లేనివాళ్లం అయిపోయాం.

ఎంపీ అభ్యర్థికి లోకల్, నాన్‌లోకల్ ఉండదు

చిత్తూరు నాన్ లోకల్ అవుతుందేమోనని చంద్రబాబును అడిగాను. ఎంపీ అభ్యర్థికి నాన్‌లోకల్ ఏంటన్నారు ఆయన. అప్పటికే వైసీపీ బాపట్ల ఎంపీగా గెలిచిన నందిగామ సురేష్ నాన్‌లోకల్. బాపట్లలో ఎప్పుడూ ఏ పార్టీ నుంచి లోకల్ అభ్యర్థి బరిలో లేదు. నరసరావుపేటలో వైసీపీ నుంచి ఎంపీగా బరిలో ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ కూడా నాన్ లోకల్. ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడ నాన్‌లోకల్.

జిల్లా ప్రజలు నన్ను సొంతం చేసుకున్నారు

చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, అమర్నాథ్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, మురళీమోహన్, థామస్.. ఇలా అందరూ తమ సొంత మనిషిలా నన్ను రిసీవ్ చేసుకున్నారు. చిత్తూరు జగన్మోహన్ అయితే తనతో పాటు నన్ను నేరుగా ప్రచారంలోకి తీసుకెళ్లిపోయారు. కుప్పంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా అన్ని సమావేశాలు, సభల్లో ఆయన నన్ను పరిచయం చేశారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించి ప్రచారాల్లో పాల్గొన్నాను. అందరు ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం చేసుకుని ఎన్నికలకు ఏం అవసరమో ఆ దిశగా కృషి చేస్తున్నాను. బీజేపీ, జనసేన నాయకులు నన్ను మరింతగా సొంతం చేసుకున్నారు.

సమస్యలేమిటో గుర్తించా

చిత్తూరు పార్లమెంటు పరిధిలో ప్రజల సమస్యల్ని ఇప్పటికే గుర్తించాం. చేనేతల సమస్యలు, పట్టు రైతుల ఇబ్బందులు, గ్రానైట్ పరిశ్రమల కష్టాలు, పండ్లు, కూరగాయల రైతుల అవసరాలన్నీ గుర్తించాం. గెలిచి వాటి పరిష్కారానికి కృషి చేయాలి.

పెన్షన్లపై జగన్ అబద్ధాలు

ఖజానాలో డబ్బుల్లేక పెన్షన్లను ఇవ్వలేదు. పైగా టీడీపీ మీద బురద జల్లుతున్నారు. జగన్ నియంతృత్వ పరిపాలన చేస్తున్నాడు. రాష్ట్రంలో ఏం జరిగినా ఎవరెలా పోయినా అధికారం మాత్రం నాకే కావాలనే మనస్తత్వం కలిగినవారు. ఎంత మందినైనా తొక్కేసి అయినా నేను గెలవాలనుకునేవారు అధికారంలోకి వస్తే ప్రమాదం.

నాకెందుకు ఓటేయాలంటే..

ప్రస్తుత ఎంపీ రెడ్డప్ప ఐదేళ్లలో ఏం చేశారనేది జనాలకు తెలుసు. కొత్తవాడిని.. నా గురించి ఏమీ తెలియదు. నన్ను నమ్మి మాత్రమే ప్రజలు ఓటేయాల్సి ఉంది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. నిత్యం అందుబాటులో ఉంటాను. పార్లమెంటులో గళాన్ని వినిపిస్తా. నేను పనిచేయకుంటే నిలదీయండి. కమ్‌డౌన్ అని నన్ను అడ్డుకోండి.

రాజకీయాలు.. మా అబ్బాయి ఆలోచనే

కంపెనీలో చేరాక సీఎస్ఆర్‌లో భాగంగా సామాజిక కార్యక్రమాలు చేసేవాడ్ని. మనం చేసే సామాజిక కార్యక్రమాలకు ప్రభుత్వం తోడైతే మరిన్ని అద్భుతాలు చేయొచ్చని మా అబ్బాయి అనేవాడు. ఆ ఆలోచనే నన్ను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది.



డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను

చదువుకుని వచ్చాను, ఉన్నత ఉద్యోగం చేశాను, పెద్ద స్థాయిలో వ్యాపార రంగంలో రాణిస్తున్నాను. నాకున్న లక్ష్యం వేరే వాళ్లకు ఉండాలనేం లేదు. ఇతరులతో నన్ను పోల్చుకోలేను. గెలిచాక నేను మాత్రం డమ్మీ ఎంపీగా అయితే పనిచేయను. పార్లమెంటులో హాజరు నమోదుకే పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి పోరాడుతాను. అన్ని రంగాల పట్ల నాకు అవగాహన ఉంది.

జగన్ గెలిస్తే డ్రగ్స్‌లో పంజాబ్‌ను మించిపోతాం

సీఎం జగన్‌కు పరిపాలన అనేది తెలియదు. అడ్మినిస్ట్రేషన్ జీరో అని చెప్పవచ్చు. ఈ ప్రభావం యువత మీద పడింది. యువతకు ఉద్యోగాలు లేవు. చదువుకున్నవాడు కూలి పనులకు పోలేడు. చెడు వ్యసనలకు అలవాటు పడుతాడు. అందుకే రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, నాసిరకం మద్యం విచ్చలవిడిగా ఉన్నాయి. పంజాబ్ యువత కూడా ఇలానే డ్రగ్స్‌కు అలవాటు పడింది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని కాపాడుకోలేక పోతున్నారు. ఆ పరిస్థితి మనకూ ప్రారంభమైంది. మళ్లీ జగన్ గెలిస్తే మాత్రం మన రాష్ట్రం పంజాబ్‌ను మించి పోతుంది. ఇక ఆర్థిక పరిస్థితి తెలిసిందే. రాష్ట్రంలో ఆరేడు లక్షల కోట్ల రూపాయల అప్పు ఉంది. ఒకప్పుడు తలసరి ఆదాయం గురించి చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు తలసరి అప్పు గురించి చెప్పుకునే స్థితికి తెచ్చారు. జగన్‌ను కంటిన్యూ చేస్తే జీవితాలను కోల్పోతారు.

ముగిసిన టెన్త్ స్పాట్

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 8: చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల ఒకటిన మొదలైన టెన్త్ స్పాట్ సోమవారంతో ముగిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,78,523 జవాబు పత్రాలను 2,131 మంది ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారు. మెడికల్ గ్రౌండ్స్‌లోని 251 సిబ్బందికి స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వగా, చిన్నచిన్న ఇబ్బందులు మినహా స్పాట్ ప్రశాంతంగా జరిగింది.

జేఈఈ మెయిన్స్‌కి 10 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 8: జిల్లాలో ఈనెల 4న మొదలైన జేఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు సోమవారం కొనసాగాయి. వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 171 మందికి గాను 161 మంది హాజరయ్యారు. 10 మంది గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు.

11న పాఠశాలలకు రంజాన్ సెలవు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 8: రంజాన్ సందర్భంగా గురువారం పాఠశాలలకు ప్రకటించిన సెలవు ఉత్తర్వులు సోమవారం జిల్లా విద్యాశాఖకు చేరాయి. 10న జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు యథావిధిగా పనిచేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



విద్యుద్దీపాల అలంకరణలో వరసిద్ధుడి ఆలయం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 8: కాణిపాకంలో మంగళవారం తెలుగు సంవత్సరాది (క్రోధి నామ సంవత్సరం) ఉగాది వేడుకలకు వరసిద్ధుడి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన ఆలయాన్ని పూర్తిగా పుష్పాలు, అరటి బోదెలు, విద్యుద్దీపాలంకరణను నిర్వహించారు. ఆలయ కల్యాణ వేదిక వద్ద పంచాగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పంచాంగ శ్రవణం అనంతరం విచ్చేసిన భక్తులకు ఉగాది పచ్చడిని అందించనున్నారు.

'మండే' ఎండలు

- అత్యధికంగా తవణంపల్లెలో 42.3, నింద్రలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు



రోడ్డు ఖాళీ ... సోమవారం మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిస్తున్న దర్గా సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: భానుడు ఉగ్రరూపం దాల్చారు. చిత్తూరు నగరం 'మండే' ఎండలతో వేడెక్కింది. సోమవారం ఉదయం 11 గంటలు దాటగానే చాలా రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే స్కార్ఫ్, వాటర్ బాటిల్ వెంట తీసుకెళ్తున్నారు. ఇవేం ఎండలు.. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్ నెలాఖరు, మే, జూన్ మొదటి వారం వరకు ఎలా ఉంటాయో అని జనం బెంబేలెత్తిపోతున్నారు. బయట నిప్పులు చెరుగుతున్న సూర్యుడు.. ఇంట్లో ఉంటే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సోమవారం అత్యధికంగా తవణంపల్లెలో 42.3, నింద్రలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. నగరిలో 41.6, విజయపురంలో 41.6, శ్రీరంగరాజపురంలో 41.4, పుంగనూరులో 40.4, సోమలలో 40.1, బంగారుపాళ్యంలో 39.9, పాలసముద్రంలో 39.9, కార్వేటినగరంలో 39.8, గుడిపాలలో 39.7, సదుంలో 39.7, చౌడేపల్లెలో 39.4, రొంపిచెర్లలో 39.4, పులిచెర్లలో 39.4, ఐరాలలో 39.4, గంగాధరనెల్లూరులో 39.3, పెనుమూరులో 39.1, పలమనేరులో 39.1, చిత్తూరులో 38.9, వెదురుకుప్పంలో 38.9, గుడుపల్లెలో 38.8, కుప్పంలో 38.7, పెద్దపంజాణిలో 38.7, శాంతిపురంలో 38.7, గంగవరంలో 38.6, వి.కోటలో 38.4, యాదమరిలో 38.3, పూతలపట్టులో 37.7, రామకుప్పంలో 36.8, బైరెడ్డిపల్లెలో 36.8 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : సా. 6.30
సహరి (బుధవారం) : ఉ. 4.43



తిరుపతి ఉప ఎన్నిక అక్రమాల్లో
గిరీషపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రాథమిక నిర్ధారణ వల్లే గతంలో వేటు ● లోతుగా విచారించాక ఉత్తర్వుల ఉపసంహరణ

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభకు 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో వేటుపడిన నాటి కార్పొరేషన్ కమిషనరు గిరీషపై ఈసీ సస్పెన్షన్ ఎత్తివేసింది. తొలుత గిరీష సస్పెండు కావడం.. ఆ తర్వాత పలువురు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు సస్పెండైన సంగతి తెలిసిందే. ఓవైపు శాఖాపరమైన విచారణ, మరోవైపు పోలీసు దర్యాప్తు జరుగుతుండగానే గిరీషపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

వాస్తవానికి జరిగిందేమిటంటే..: ఎన్నికల నిబంధనల ప్రకారం షెడ్యూలు విడుదల నాటికి ఆ జిల్లాలో మూడేళ్లకు పైబడిన అధికారులు తప్పనిసరిగా బదిలీ కావాలి. తిరుపతి ఉప ఎన్నిక నాటికి గిరీష.. జేసీగా రెండేళ్లు, కార్పొరేషనరు కమిషనర్‌గా రెండేళ్లు కలిపి నాలుగేళ్లు పనిచేస్తున్నారు. కానీ, ఎన్నికల సమయంలో బదిలీ కాలేదు. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వోకు తాను నిబంధనల రీత్యా అనర్హుడినని అప్పటి కలెక్టర్‌కు గిరీష నివేదించారు. కలెక్టర్ కూడా ఈసీకి సమాచారమిచ్చారు. తర్వాత కార్పొరేషన్‌లో అప్పటి డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఈఆర్వోగా కలెక్టర్ నియమించారు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో గిరీష పేరు, ఆయన మొబైల్ నెంబరు తొలగించలేదు. దీంతో ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ వ్యవహారంలో సాంకేతికంగా గిరీష బాధ్యత వహించాల్సి వచ్చింది. కొంతకాలం తర్వాత ఈసీ వెబ్‌సైట్‌లో గిరీష అధికారిక మొబైల్ నెంబరు తొలగించి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి నెంబరు నమోదు చేశారు. ఇదెలా జరిగిందో అర్థంకావడం లేదు. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ మాత్రమే ఈ మార్పుచేర్పులు చేయగలరు.

ప్రాథమిక నిర్ధారణ మేరకే..

లోక్‌సభ ఉప ఎన్నికల నాటికి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న గిరీష, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా వ్యవహరించారు. ఈసీ రికార్డుల్లో ఈఆర్వోగా ఆయన పేరే ఉంది. ఎపిక్ కార్డులను భారీ సంఖ్యలో డౌన్‌లోడ్ చేయాలంటే ఈఆర్వో లాగిన్ నుంచే వీలవుతుంది. ఈ కారణంగా ఆయన ప్రమేయం ఉందని ప్రాథమికంగా భావించిన ఈసీ తొలుత ఆయన్ను బాధ్యుడిగా పేర్కొంటూ సస్పెండు చేసింది.

చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఎడాపెడా వాడేశారు

వ్యక్తిగతంగా అవినీతి ఆరోపణలు లేనప్పటికీ చంద్రమౌళీశ్వర్‌రెడ్డికి.. అధికార పార్టీ నేతలు చెప్పింది చేసిపెడతారన్న పేరుంది. అందుకనే అధికార పార్టీ నేతలు.. ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను పెట్టుకుని చంద్రమౌళీశ్వర్‌రెడ్డి లాగిన్ పాస్‌వర్డు తీసుకుని 36వేల ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేయించారు. ఇవేవీ తెలియని ఎన్నికల కమిషన్.. ఈఆర్వో గిరీష కాబట్టి ఆయనే బాధ్యుడిగా సస్పెండ్ చేసింది. ఈ అంశాలన్నింటిపై సాంకేతిక ఆధారాలతో గిరీష ఈసీకి సంజాయిషీ ఇచ్చినట్టు తెలిసింది. సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

దర్జాగా సూత్రధారులు..

ఎపిక్ కార్డుల వ్యవహారంలో సూత్రధారులైన అధికార పార్టీ నేతలు దర్జాగా తిరుగుతుండగా.. తెలిసి కొందరు, తెలియక ఇంకొందరు పాత్రధారులైన అధికారులు మాత్రం ఈసీ చర్యలకు గురై సతమతమవుతున్నారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఈఆర్వోగా నమోదైన పాపానికి యువ ఐఏఎస్ అధికారి గిరీష సస్పెండవడంతో అవమానకర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి ఈఆర్వో స్థాయిని దుర్వినియోగం చేసినందుకు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి కూడా సస్పెండయ్యారు. తిరుపతి అర్బన్ తహసీల్దారు, డీటీపైనా చర్యలు తీసుకోగా.. పలువురు కంప్యూటర్ ఆపరేటర్లను తొలగించారు. విచారణ నుంచి బయటపడితే తప్ప భవిష్యత్తులో పదోన్నతులపైనా ఇది ప్రభావం చూపనుంది. కాగా, వైసీపీలో కీలక నేత, ఆయన తనయుడు ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారులన్నది బహిరంగ రహస్యంగా మారింది. పోలీసు దర్యాప్తు సక్రమంగా కొనసాగితే సూత్రధారులు నిందితులుగా మారే అవకాశముంది. లేకుంటే కింది స్థాయి చిరుద్యోగులు బలయ్యే ప్రమాదముంది.

ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు


కేడీసీలో ఉట్టి కొడుతున్న దృశ్యం

కుప్పం, ఏప్రిల్ 8: కుప్పం డిగ్రీ కళాశాలలో సోమవారం ముందస్తు ఉగాది సంబరాలు జరుపుకొన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి పూజలు చేశారు. పంచాంగ శ్రవణం చేసి, ఉగాది పచ్చడి అందరికీ పంచిపెట్టారు. ఉట్టి కొట్టడం వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంచిపెట్టారు.

కల్లూరు : కల్లూరు ఉన్నత పాఠశాలలో సోమవారం నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ముందుస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. హెచ్ఎం శ్రీవాణి ఉగాది పచ్చడిని ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు టౌన్ జనసేన యువత అధ్యక్షుడిగా యశ్వంత్



పలమనేరు : పలమనేరు టౌన్ జనసేన యువత అధ్యక్షుడిగా యశ్వంత్ నియమితులయ్యారు. ఆ మేరకు పట్టణ జనసేన అధ్యక్షుడు హరీష్‌రాయల్ ఉత్తర్వులు అందజేశారు. యశ్వంత్ మాట్లాడుతూ అమరనాథరెడ్డి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

క్యాషియర్ లేక ఖాతాదారుల అవస్థలు

కల్లూరు, ఏప్రిల్ 8: కల్లూరులోని ఇండియన్ బ్యాంకులో సోమవారం క్యాషియర్ రాకపోవడంతో మధ్యాహ్నం 12గంటల వరకు ఖాతాదారుల కష్టాలు వర్ణనాతీతం. అయితే మధ్యాహ్నం 12 గంటలకు పులిచెర్ల ఇండియన్ బ్యాంకు నుంచి డిప్యుటేషన్‌పై క్యాషియర్ రావడంతో లావాదేవీలు ప్రారంభమయ్యాయి. క్యాషియర్ రెండు నెలల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఆ పోస్ట్ ఖాళీ అయింది. త్వరలో సిబ్బందిని భర్తీ చేస్తామని, ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా లావాదేవీలు కొనసాగిస్తున్నామని మేనేజర్ హరిబాబు తెలిపారు.


కౌంటర్ ముందు క్యూ కట్టిన ఖాతాదారులు

కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజలు



రామకుప్పం, ఏప్రిల్ 8 : పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని అర్చనలు చేయించారు.

పుంగనూరులో 498 మంది వలంటీర్లు రాజీనామా

పుంగనూరు రూరల్, ఏప్రిల్8: మండల, పట్టణ పరిధిలోని 498మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా పత్రాలను ఎంపీడీవో మనిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డికి సోమవారం అందజేశారు. మండల పరిధిలో 210మంది, పట్టణ పరిధిలో 288మంది రాజీనామా పత్రాలను అందజేశారు.

శాంతిపురంలో 213 మంది..

శాంతిపురం, ఏప్రిల్8: మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించిన 213 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం మండల సచివాలయ సమీపంలోని ఓ ప్రైవేటు భవనంలో వైసీపీ నేతలు వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం వలంటీర్ల రాజీనామాలను ఎంపీడీవో మైథిలికి అందించారు. మండలంలో ఇంకా సుమారు 80 మంది వలంటీర్లు విధుల్లో ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు.

గుడుపల్లెలో 123 మంది..

గుడుపల్లె, ఏప్రిల్ 8: మండలంలోని 123 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో గోపికి సోమవారం అందజేశారు. మండల మొత్తం 193 మంది వలంటీర్లు ఉండగా ఇప్పటి వరకు 136 మంది రాజీనామాలు సమర్పించారు. బుధవారం మిగిలిన వారు కూడా రాజీనామాలు సమర్పిస్తారని సమాచారం.

కుప్పం మున్సిపాలిటీలో ..

కుప్పం, ఏప్రిల్ 8: కుప్పం పురపాలక సంఘం పరిధిలో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. 12 సచివాలయాల పరిధిలోని మొత్తం 247 మంది వలంటీర్లు సోమవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు రాజీనామా పత్రాలు సమర్పించారు.

రామకుప్పంలో 160 మంది..

రామకుప్పం, ఏప్రిల్ 8: మండలంలో 160 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. మండలంలో ఇప్పటివరకు మొత్తం 260 మంది ఎంపీడీవో ఈశ్వరన్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

బైరెడ్డిపల్లెలో 36 మంది ..

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 8 : బైరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో 36మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాము రాజీనామా చేస్తున్నట్లు వారు ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను అందజేశారు.

నిండు మనసుతో ఆశీర్వదించండి : చల్లా


చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన రొంపిచెర్ల, చౌడేపల్లె మండలాలకు చెందిన వైసీపీ నాయకులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 8: రానున్న ఎన్నికల్లో నిండు మనసుతో తనను ఆశీర్వదించాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్ల మండలం బోడిపాటివారిపల్లె పంచాయతీలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా దద్దాలవారిపల్లెలో గజమాలతో చల్లాబాబుకు స్వాగతించారు. సూపర్ సిక్స్ కరపత్రాలు పంచుతూ చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. దద్దాలవారిపల్లె గ్రామానికి చెందిన 25 మంది వైసీపీ కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సిద్దయ్య, బాలకృష్ణ, నాగరాజ, మల్లికార్జున, మాజీ ఉప సర్పంచ్ అంజనప్ప, చలపతి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, సునీల్, కృష్ణమూర్తితోపాటు వారి అనుచరులకు చల్లాబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే రొంపిచెర్లలో చౌడేపల్లి మండలం చారాల, దుర్గసముద్రం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు రవికుమార్, కె.సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, యుగంధర్, లక్ష్మీపతి (నాని), సుబ్రమణ్యం, ఆనంద్, శ్రావణ్‌కుమార్ తదితరులు చల్లా రామచంద్రారెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ సోమవారం టీడీపీలో చేరారు. కార్యక్రమంలో లోకనాథం, రవినాయుడు, నాగార్జుననాయుడు, నరసింహులునాయుడు, అమరనాథనాయుడు, సుబ్రమణ్యం, కుమార్, శేషాద్రినాయుడు, శ్రీనివాసులునాయుడు, ఉయ్యాల రమణ, ఓబులేశ్వరరెడ్డి, జనసేన మండలపార్టీ అధ్యక్షుడు రెడ్డిశేఖర్, చౌడేపల్లి టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి, పృథ్వీరాజు, బాబునాయుడు, గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కావాలంటే టీడీపీ గెలవాలి

పుంగనూరు : రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు కావాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలని టీడీపీ నాయకులు కోరారు. సోమవారం మండల పరిధిలోని మాగాండ్లపల్లె, మేలుందొడ్డి పంచాయతీల్లోని గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ టీడీపీ మ్యానిఫెస్టో ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ టీడీపీ పాలనలో పేదలకు పండుగ సమయాల్లో అన్ని వర్గాల ప్రజలకు నిత్యావసర సరుకులు ఉచితంగా అందించేవారని గుర్తు చేశారు. పేద కుటుంబాల్లో వివాహాలు జరిగితే వారికి వివాహ ఖర్చులకు డబ్బులు సహాయం చేసేవారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలనలో పండుగలకు సరుకులు ఇవ్వకపోగా ధరలను పెంచివేశారని తెలియజేశారు. పట్టణ పరిధిలో టీడీపీ నాయకులు శ్రీకాంత్, దినేశ్ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, కౌన్సిలర్ రామకృష్ణమరాజు,నౌషాద్, నూర్, చిన్న మోహన్‌నాయుడు, రెడ్డెప్పయాదవ్, గంగధర్, శమిపతి, ప్రసాద్, జనసేన నాయకులు విరూపాక్షి, చిన్నారాయల్, చైతన్యరాయల్, హరినాయక్, నవీన్‌యాదవ్, వెంకటేశ్, బాలాజీ, హరి పాల్గొన్నారు.

నేడు టీడీపీ బైక్ ర్యాలీ

పులిచెర్ల మండలంలో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని పోశంవారిపల్లి పంచాయతీ దిన్నెపాటివారిపల్లెలో ఉదయం 7గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవు తుందన్నారు. అనంతరం ఎల్లంకివారిపల్లి, మంగళంపేట, పులిచెర్ల మీదుగా రొంపిచెర్ల మండలలోని బొమ్మయ్యగారిపల్లి పంచాయతీ వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి పేదవాడి లబ్ధి : టీడీపీ


గుండిశెట్టిపల్లెలో టీడీపీ నేతలతో కంచర్ల శ్రీకాంత్, పీఎస్ మునిరత్నం

శాంతిపురం ఏప్రిల్ 8 : సూపర్ సిక్స్ పథకాల అమలులో ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి పేదవాడికి లబ్ధి చేకూర్చనున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ కన్వీనర్ డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. సొన్నేగానిపల్లె పంచాయతీ గుండిశెట్టిపల్లెలో సోమవారం వారు మండల టీడీపీ నేతలతో కలిసి పర్యటించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుప్పంలో రౌడీయిజం, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, దోచుకోవడం లాంటివి అధికమయ్యాయన్నారు. కుప్పం ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, మంజునాథ్‌రెడ్డి, బాలు, గోవిందరాజులు, నారాయణప్ప, ఉయ్యాల జయరామిరెడ్డి, శ్యాంతారాం, పవనకళ్యాణ్, మునెప్పగౌడు, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 8: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పుంగనూరుకు చెందిన 12మంది విద్యార్థులు ప్రతిభ కనబరించినట్లు గురుకులం మణికంఠ ఆచార్య తెలిపారు. పాకాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన చదరంగం పోటీల్లో అండర్-13 బాలిక విభాగంలో విజయవాణి పాఠశాలకు చెందిన భవికీర్తి ప్రతిభ కనబరిచి రూ.600 రివార్డు పొందినట్లు తెలిపారు. బాలికోన్నతపాఠశాలకు చెందిన ఉషశ్రీ, నవ్యశ్రీ, వనితలు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పుంగనూరు లయన్స్‌క్లబ్ సహాయ సహకారాలతో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు.

మాటతప్పిన జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి


అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వి.కోట, ఏప్రిల్ 8: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మాటతప్పి.. మడమతిప్పిన సీఎం జగన్‌రెడ్డికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం వి.కోటలో జరిగిన యువత సమావేశానికి పెద్ద ఎత్తున యువత తరలి వచ్చారు. పలువురు యువకులు మాట్లాడుతూ ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న జగన్‌రెడ్డి అసలు జాబులే లేకుండా చేసి నిరుద్యోగులతో ఆటలాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ 2014లో తన తండ్రి వైఎస్ మరణాన్ని, ఆపై 2019 ఎన్నికలో మాజీ మంత్రి వైఎస్ వివేక హత్యను జగన్ రాజకీయాలకు వాడుకుని లబ్ధి పొందారన్నారు. అవ్వాతాతల పింఛన్లను రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. మే 13న జరిగే ఎన్నికలో యువత పూర్తిగా అప్రమత్తంగా ఉండి టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ అమరావతి రాజధాని జరగాలన్నా.. రాష్ట్రం తిరిగి గాడిన పడాలన్నా సమర్థ నాయకుడైన చంద్రబాబుకు అధికారం కట్టబెట్టాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మెన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా యువత కార్యదర్శి శబరీష్, మండల ఐటీడీపీ కన్వీనర్ కోదండరెడ్డి, సీనియర్ నాయకులు రాంబాబు, చౌడప్ప, నాగభూషణం, శివకుమారి, తెలుగు యువత జనార్ధన్ రెడ్డి, నరేష్, సతీష్, కోదండ, గజేంద్ర, యాజ్, వెంకి, త్యాగరాజ్, దిలీప్, చైతు, బాబు, శివ, రామూర్తి, మురుగేష్, లక్ష్మణ్, సేక్ ఉమ్మర్, యాజీర్, నాసీర్, హరి, గుణలతో పాటు బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

వి.కోట మండలం గోనుమాకులపల్లె పంచాయతీ, వి.కోట పంచాయతీ పట్రపల్లె గ్రామాల నుంచి భారీ ఎత్తున వైసీపీ నుంచి నాయకులు టీడీపీలోకి వలస వచ్చారు. పసుపు కండువాలు వేసి అమరనాథరెడ్డి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పట్రపల్లెకు చెందిన వైసీపీ గృహసారథి నరేంద్రప్రసాద్, గోనుమాకులపల్లె మాజీ సర్పంచ్ జగదీష్ గౌడ, సుబ్రమణ్యంశెట్టి, వెంకటప్పగౌడు, నాగరాజు, శివకుమార్, ప్రసాద్, గణేష్, అశోక్, సూర్యప్రకాష్, హరికృష్ణ, పురుషోత్తం, గజేంద్ర, శ్రీరాములు, పురుషోత్తం, శ్రీనివాసులు, మురుగేష్, బోయకొండ, కృష్ణప్ప, భరత్, పవన్, మోహన్, సంతోష్ తదితరులు ఉన్నారు.

పండుగలతో రద్దీగా మారిన వి.కోట



వి.కోట, ఏప్రిల్ 8: మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వి.కోటలో ఇటు ఉగాది, అటు రంజాన్ పండుగలతో పట్టణం పూర్తిగా రద్దీగా మారింది. రెండు పండుగలు ఒకేసారి రావడంతో కొనుగోళ్ళ కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంతో సోమవారం పట్టణంలోని అన్ని దుకాణాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా దుస్తుల షాపులు ఉన్న ప్రాంతాలు జనసంద్రాలను తలపించాయి. పూలు, పండ్లు కొనుగోళ్ళకు జనం ఎగబడటంతో ఎగువ చెక్‌పోస్టు ప్రాంతంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంది. అటు, ఇటుగా వచ్చి వెళ్ళే వాహనాలను నియంత్రించేందుకుయ పోలీసులు ప్రయత్నించినా గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మరో రెండు రోజులు పట్టణంలో ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని, పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర బలగాలతో కవాతు



గంగవరం, ఏప్రిల్ 8: ప్రతిఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. సోమవారం మండలంలోని కల్లుపల్లె, మల్లేరు, మబ్బువాళ్లపేట, మేలుమాయి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఓటు వేయడానికి ఎవరి ఒత్తిళ్లకు గురికావాల్సిన పనిలేదని, ప్రజలకు అండగా పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మనోహర్, హెచ్‌సీ వెంకటేష్, కేంద్రబలగాలు పాల్గొన్నాయి.

సదుం గంగమ్మ జాతర



సదుం, ఏప్రిల్ 8: సదుం నడివీధి గంగమ్మ జాతర వైభవంగా ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి చాకలి వారి ఇంటి వద్ద సుద్ధమట్టితో అమ్మవారి ప్రతిమను అలంకరించి గ్రామ దేవత సదుమమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామ నడిబొడ్డున ఏర్పాటు చేసిన చలువ పందిరిలో కొలువుదీర్చారు. రెండురోజులుగా పూజలందుకున్న దున్నపోతును అమ్మవారికి బలిదానం చేశారు. అనంతరం మహిళలు దీపాలను తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ముస్లింలు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ నలుదిక్కుల్లో ఉన్న గంగరాళ్లకు పూజలు నిర్వహించి అంబలి పంచారు. అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక కుమారుని ఒడ్డులో నిమజ్జనంతో జాతర ముగిసింది. అలాగే పాలమంద, బూరగమంద, రెడ్డివారిపల్లె, కుర వపల్లెల్లోనూ అమ్మవారి జాతర వేడుకలు జరిగాయి.

అగ్నిమారెమ్మ కల్యాణోత్సవం



గుడుపల్లె, ఏప్రిల్ 8: మండల పరిధిలోని గుండ్లసాగరంలో కొలువైన అగ్ని మారెమ్మ కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది. అగ్ని మారెమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహిళలు ఫల, పుష్ప, తాంబూలాలతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అగ్నిమారెమ్మ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

టీడీపీ విజయం బీసీలదే : ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం రూరల్, ఏప్రిల్ 8: బీసీలు, టీడీపీ వేర్వేరు కాదని, టీడీపీ విజయం సాధిస్తే ఆ గెలుపు బీసీలదేనని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మల్లానూరు పంచాయతీలో సోమవారం జయహో బీసీ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉందని చెప్పారు. అధినేత చంద్రబాబు పలు సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రుణాలివ్వడం ద్వారా ఉపాధి కల్పించిన అంశాన్ని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే బీసీల సంక్షేమం, అభివృద్ధికోసం పలు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చంద్రబాబు లక్ష ఓట్ల మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తూ మల్లానూరు మసీదులో ముస్లింలు సోమవారం ప్రార్థనలు చేశారు.

పల్లెల ప్రగతి కోసం టీడీపీకి పట్టం కట్టాలి


రామకుప్పంలో పర్యటిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 8 : పల్లెలు ప్రగతి పథంలో పయనించాలంటే ప్రజలు టీడీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి కోరారు. సోమవారం రామకుప్పం పట్టణం శివాజీ నగర్, హైస్కూల్ వీధుల్లో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది మచ్చుకైనా కనబడడం లేదని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్నా, పేదలకు పేదరికం నుంచి విముక్తి కలగాలన్నా టీడీపీ పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. అలాగే టీడీపీ విస్తరణ విభాగ కమిటీ సభ్యుడు కన్నన్ శివాజీనగర్ దళితవాడలో ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఐదేళ్లలో దళితులకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. కార్యక్రమంలో నేతలు రామకృష్ణప్ప, సలాం సబ్, పద్మనాభరెడ్డి, అక్బర్‌బాషా, బాలరాజు, సుబ్రీ, సతీష్, అవినాష్, ఆదిల్ కేశవరెడ్డి, శంకర్, పద్మమ్మ, మునికృష్ణ, బాబు, అంజి, దయానంద, చలపతి, శేఖర్, భూపతి, భాస్కర్, బీజేపీ నేత ఆంజనేయలు పాల్గొన్నారు.

సొంత గూటిలోనే టీడీపీ కార్యకర్తలు

గుడుపల్లె, ఏప్రిల్ 8: మండలంలోని గుండ్లసాగరం, గుత్తార్లపల్లె గ్రామాలకు చెందిన 10 టీడీపీ కుటుంబాలు సొంత పార్టీలోనే ఉన్నట్లు వారు తెలిపారు. ఆదివారం వైసీపీ చెందిన నాయకులు కొంత మంది సమావేశం ఉందని చెప్పి గ్రామ సమీపంలోని స్థలం వద్దకు వారిని పిలిచారు. వారికి ఇష్టం లేకపోయినా వైసీపీ కండువాలు కప్పారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానిక నేతల వద్ద వారు తమకు జరిగిన అన్యాయాన్ని వెళ్లబుచ్చారు. సోమవారం టీడీపీ నాయకుల సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకొని తమ సొంత గూటిలోనే ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేతలు మునిరాజు, ఉదయ్‌కుమార్, అమీర్, సుబ్రహ్మణ్యం, మున్నీరు, షణ్ముగం పాల్గొన్నారు.

టీడీపీతో బీసీల రాజ్యం

కుప్పం, ఏప్రిల్ 8: టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల రాజ్యం వచ్చినట్లేనని ఆ పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. పురపాలక సంఘంలోని 11వ క్లస్టర్ జయహో బీసీ కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక ప్రణాళికలను అధినేత చంద్రబాబు సిద్ధం చేస్తున్నారన్నారు. లక్ష ఓట్ల మెజారిటీతో ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగుదేశంతోనే రాష్ట్ర, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, వేలు, సతీశ్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

గంగవరం, ఏప్రిల్ 8: టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పత్తికొండ, కీలపల్లె పంచాయతీల్లో టీడీపీ నాయకులు, బూత్‌కమిటీ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ ఫలాలపై క్షుణ్ణంగా వివరించి చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు రవి పలువురు బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుకోసం కృషిచేయండి

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 8 : ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం పార్టీశ్రేణులు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు కోరారు. గంగినేపల్లె పంచాయతీలో సోమవారం గ్రామకమిటీ, సెక్షన్ ఇన్‌చార్జిలకు సూచనలిచ్చారు. అమరనాథరెడ్డిని గెలిపించడానికి కృషి చేయాలని ఆయన కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సంక్షేమపథకాల గురించి ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.

తాగునీటి సమస్యతో గ్రామస్తుల సతమతం


నిరసన తెలుపుతున్న మహిళలు

రామకుప్పం,ఏప్రిల్8: మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. పంచాయతీ కేంద్రం 89 పెద్దూరులో రక్షిత మంచినీటి పథకం బోరులో 15రోజుల క్రితం వరకు పుష్కలంగా నీరు ఉండేది. బోరులో జలాలు అడుగంటడంతో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు ద్వారా కొళాయిల్లో ఎప్పుడు నీరు వస్తుందోనని గ్రామస్తులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో తమ నిరసనను వ్యక్తం చేశారు. బోరులో అదనపు పైపులు అమర్చితే తాగునీటి సరఫరా మెరుగు పడుతుందని వారు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగు నీటి సరఫరా మెరుగుపరచాలని వారు కోరారు.

శ్రీరామ ఉత్సవాల కోసం ఆర్డీవోకు వినతి

పలమనేరు, ఏప్రిల్ 8 : పలమనేరులో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆర్డీవో మనోజ్‌రెడ్డికి శ్రీరాముల ఆలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్, ఆర్యవైశ్య సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహప్రతిష్ఠ, జనవరి 26న శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీరామ, హనుమ చిత్రాలతో ఉన్న కాషాయ జెండాలను ఎన్నికల కోడ్ వచ్చిందని అనవసరంగా తొలగించారని పేర్కొన్నారు. తెలియక కొందరు వాటిని తొలగించారని, ఇకపై అటువంటి కాషాయ జెండాలు తొలగించరని ఆర్డీవో హామీ ఇచ్చారన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

కల్లూరు : పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త దొరస్వామి(55) ఆదివారం మృతి చెందడంతో చల్లా రామచంద్రారెడ్డి సోమవారం ఆ గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి సోదరుడు భాస్కర్‌తో మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

బాటగంగమ్మ ఆలయంలో అమావాస్య పూజలు



బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 8 : పట్టణంలోవున్న బాట గంగమ్మ ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆరోగ్యసంరక్షణపై అవగాహన

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 8 : కమ్మనపల్లె ఆదర్శపాఠశాలలో సోమవారం విద్యార్థినులకు ఆరోగ్య సంరక్షణపై ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శిరీష అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ధ్యానం, వ్యాయామం, ఆటలు, సంగీతం నేర్చుకోవాలని వివరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే సమస్యలు, మాతాశిశు మరణాలు, పోషకాహార ప్రాముఖ్యత, రక్తహీనత వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యవిస్తరణాధికారి గుణశేఖర్, మాస్ మీడియా అధికారి జయరాముడు, వైద్యాధికారి డాక్టర్ విజయచందర్, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ప్రిన్సిపాల్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కమ్మనపల్లె కస్తూర్బా పాఠశాలలో కూడా అవగాహన కల్పించారు.

వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్ల రద్దు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 8: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ అయినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రవిరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో అన్ని క్యాడర్లలో డిప్యుటేషన్, వర్క్ ఆర్డర్లపై పనిచేస్తున్న వారిని వెంటనే వారి స్థానాల్లో చేరాలని ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీ వైద్యాధికారులు, డీడీవోలు ఇంప్లిమెంట్ చేయాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులెవరైనా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బియ్యం పంపిణీకి సర్వర్ సమస్య



పైపల్లెలో సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బంది పడుతున్న కార్డుదారులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: నిత్యావసర వస్తువుల పంపిణీకి సర్వర్ సమస్య పీడిస్తోంది. ఏప్రిల్ నెల కోటా పంపిణీ గత సోమవారం నుంచి ప్రారంభమైంది. సాంకేతిక సమస్యల కారణంగా జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా సర్వర్ పనిచేయకపోవడంతో ఎండీయూ వాహనాల వద్ద కార్డుదారులు ఎండల్లో అవస్థలు పడ్డారు. సర్వర్‌పై ఒత్తిడి పెరుగుతుండడంతో బియ్యం పంపిణీ మందకొడిగా సాగుతోంది. రద్దీగా ఉన్న సందర్భాల్లో మరికొన్ని గంటలు నిరీక్షిస్తున్నారు. మొత్తం 5.43 లక్షల మంది కార్డుదారులుండగా సోమవారం నాటికి 3.48 లక్షల కార్డులకు బియ్యం, చక్కెర, రాగిపిండి (64.17 శాతం) పంపిణీ జరిగింది. పోర్టబిలిటీ ద్వారా 63,244 కార్డుదారులు నిత్యావసర వస్తువులు పొందారు.

బండపల్లిలో పోలీసుల దాడులు

● 400 లీటర్ల సారా ఊట ధ్వంసం



గుడిపాల, ఏప్రిల్ 8: గుడిపాల మండలం బండపల్లి గ్రామ చివరలో సోమవారం సారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తి గురించి ఆరాతీస్తున్నారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు చేపట్టినా తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ ఆదేశించారు.

సారా తయారీకి వినియోగించిన సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మేమెందుకు రాజీనామా చేయాలి..!?

● చంద్రగిరిలో వైసీపీ నాయకులు, అధికారులపై తిరగబడిన వలంటీర్లు

చంద్రగిరి, ఏప్రిల్ 8: మేము ఎందుకు రాజీనామా చేయాలంటూ చిత్తూరు జిల్లా చంద్రగిరిలో గ్రామ వలంటీర్లు తిరగబడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామ వలంటీర్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నన్ని రోజులు తమ విధులలో, రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే చంద్రగిరి మండలంలో వైసీపీ నాయకులు రోజుకు ఐదుగురు చొప్పున వలంటీర్లు రాజీనామా చేయాలంటూ తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం వలంటీర్లను మండల ఉన్నతాధికారుల వద్దకు వీరు తీసుకెళ్లారు. అధికారులు కూడా తమ విధులకు రాజీనామా చేయాలంటూ ఆదేశించినట్లు సమాచారం. అయితే తామెందుకు రాజీనామా చేయాలని కొందరు వలంటీర్లు ఎదురు తిరగడంతో అధికారులు కంగుతిన్నారు. కాగా, తాము వైసీపీ కార్యక్రమాలలో పాల్గొనేందుకు నాయకులు బెదిరించి రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తున్నట్లు వలంటీర్లు చెబుతున్నారు. తాము రాజీనామా చేసి వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనాలని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటసూర్యసాయిని వివరణ కోరగా.. వలంటీర్లను రాజీనామా చేయమని ఎవరూ చెప్పలేదన్నారు. ఎన్నికలలో రాజకీయ పార్టీలలో పాల్గొనకూడదని మాత్రమే చెప్పినట్లు తెలిపారు. ఎవరైనా అధికారులు రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని వలంటీర్లకు సూచించినట్లు పేర్కొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీరు తొలగింపు

వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీ వలంటీర్ శ్రీకాంత్ తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా, ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు.

15నుంచి వస్త్రాల ఈ-వేలం

తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు టీటీడీ ఈ-వేలం వేయనుంది. కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 335(23541-23552) లాట్లు ఉన్నాయి. ఇందులో ఆర్ట్ సిల్క్ ధోతీలు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, దుపట్టాలు, శాలువలు, బెడ్ షీట్లు, నాప్‌కిన్స్ హ్యాండ్ కర్చీఫ్‌లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, జంకాళాలు, కార్పెట్లు ఉన్నాయి. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429, టీటీడీతిరుమల.ఓఆర్జీ, కొనుగోళ్లు.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్లను సంప్రదించవచ్చని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

నకిలీ రైల్వే పోలీస్ అరెస్టు

నాగలాపురం, ఏప్రిల్ 8: నకిలీ రైల్వే పోలీసును స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారం రోజులు మునుపు ఓ వ్యక్తి ఆర్‌పీఎఫ్ పోలీస్ నంటూ నాగలాపురంలోని పలు ఇంటర్‌నెట్ కేంద్రాల నుంచి డబ్బుల వసూలుకు యత్నించాడు. దీనిపై గత శనివారం రైల్వే పోలీస్ పేరుతో డబ్బులు డిమాండ్ అన్న కథనం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైంది. ఎస్‌ఐ ఓబయ్య విచారణ చేపట్టారు. నకిలీ రైల్వే పోలీసులా వ్యవహరించిన పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన వినురాజును అరెస్టు చేశారు. కాగా రైల్వే పోలీసుల సాయంతోనే నిందితుడు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. ఈ నకిలీ పోలీస్‌ని కేసు నుంచి తప్పించేందుకు మండలానికి చెందిన ఓ అధికార పార్టీ నేత పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

వేడుకగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం వేడుకగా జరిగింది. అమావాస్య తిథి విశేషాన్ని పురస్కరించుకొని ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారానికి ముందస్తుగా సమాచారమివ్వాలి

● రాజకీయ పార్టీలకు ఎస్పీ మణికంఠ సూచన



ఎస్పీతో కలిసి ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: ఇంటింటి ప్రచారం కోసం ముందస్తుగా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని రాజకీయ పార్టీలకు ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికలకు సంబంధించిన వివిధ అధికారులతో క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన బాధ్యతలపై కలెక్టర్ షన్మోహన్‌తో కలిసి సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో బాణసంచా ఉపయోగించరాదన్నారు. వాహనాల తనిఖీ సమయంలో దొరికిన నగదు, మద్యం, ఇతర వస్తువులకు సరైన ఆధారాలు లేకుంటే వాటిని సీజ్ చేసేటప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో 18వ తేదీ నుంచి అదనంగా సిబ్బందిని నియమిస్తామని వివరించారు. ఆ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరా, వీడియో కవరేజ్, వెబ్‌కాస్టింగ్ ఉంటుందన్నారు. వీటికి సంబంధించిన లింక్ కలెక్టర్, ఎస్పీకి ఉంటుందని చెప్పారు. అనుమతిచ్చిన వాహనాలను ఇతర బృందాల అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ షన్మోహన్ చెప్పారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమౌతున్న దృష్ట్యా అన్నిరకాల బృందాలు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. వాహన తనిఖీల్లో రూ.50వేలకు మించి నగదు ఉంటే, వాటికి సరైన ఆధారాలుంటే విడిచిపెట్టాలన్నారు. ఒకవేళ సరైన ఆధారాలు లేకుండా అనుమానిత నగదు ఉంటే, వాటిని ఇన్‌కంట్యాక్స్ అధికారులకు పంపాలన్నారు. పోస్టాఫీసులు, బ్యాంకుల నుంచి నగదును ఇతర పోస్టాఫీసులు, బ్యాంకులకు తరలిస్తుంటే ఆయా రిటర్నింగ్ అధికారులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, వివిధ బృందాల అధికారులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్నికలయ్యే వరకు బాధ్యతతో పనిచేయాలి

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అన్నిరకాల బృందాలు, నోడల్ అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ షన్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీతో కలిసి ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగ ఓటర్లకోసం వీల్‌చైర్‌ను ఉంచాలన్నారు. త్వరలో జిల్లాకు ఎన్నికల పరిశీలకులు రానున్నారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు, సెక్టోరల్ అధికారులు, పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్ తీసుకుని వెళ్లేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంచేయాలని రవాణాశాఖ నోడల్ అధికారిని ఆదేశించారు. ఏ రోజుకు ఆరోజు నివేదికలను సంబంధిత రిటర్నింగ్ అధికారుల ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ, డీఆర్వోతో పాటు నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎలక్షన్ కంట్రోల్ రూమ్ పరిశీలన

కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 24గంటలూ పనిచేసేలా ఏర్పాటు చేసిన ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య తనిఖీ చేశారు. కంప్యూటర్ సిస్టమ్స్ పనితీరు గూర్చి అడిగి తెలుసుకున్నారు.

జడ్పీ వ్యవహారంపై 12న విచారణ

● రికార్డులు మాయం కావడంపై ఉన్నతాధికారుల సీరియస్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 8: చిత్తూరు జిల్లా పరిషత్తులో జరుగుతున్న వ్యవహారాలు రోజురోజుకూ తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి. గతంలో ఇక్కడ సీఈవోగా పనిచేసి ఇటీవల వేరే శాఖకు బదిలీ అయిన ప్రభాకర్‌రెడ్డి హయాంలో జరిగిన అక్రమాల గురించి ప్రభుత్వానికి వరుస ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై విచారణకు జేసీ శ్రీనివాసులును విచారణాధికారిగా కలెక్టర్ షన్మోహన్ నియమించారు. విచారణ సమయంలో అవసరమైన రికార్డులను మాజీ సీఈవోకు నమ్మిన వ్యక్తిగా ఉన్న జడ్పీలోని ఓ అధికారి మాయం చేసినట్లు తెలిసింది. అతడూ విధులకు హాజరు కావడంలేదని సమాచారం. దీంతో ఆదివారం జరగాల్సిన జేసీ విచారణ వాయిదా పడింది. ఈ విషయంగా కలెక్టర్, జేసీ ఆగ్రహించినట్లు సమాచారం. దీంతో ఆ అధికారి మళ్లీ ప్రత్యక్షమయ్యారు. తాను సెలవులో ఉన్నట్లు పాత తేదీతో లీవ్ లెటర్‌ను అందించేందుకు ప్రయత్నించారు. ఈ విషయంగా ప్రస్తుత జడ్పీ ఉన్నతాధికారి ఆగ్రహించినట్లు సమాచారం. ఆదివారం జరగాల్సిన విచారణ 12వ తేదీన ఉంటుందని తెలుస్తోంది. జేసీ ఆధ్వర్యంలో ఆ రోజు జరిగే విచారణకు అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచాలని మాజీ సీఈవోకు నమ్మిన వ్యక్తికి ప్రస్తుత ఉన్నతాధికారి ఆదేశించినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని గమనిస్తున్న జడ్పీ ఉద్యోగులు తమపై ఎక్కడ వేటు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చుల్లో అక్రమాలు

● జడ్పీ మాజీ సీఈవోపై విచారించండి

జిల్లాలో 2022లో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఖర్చుల్లో అప్పటి సీఈవో ప్రభాకర్‌రెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు టీడీపీ నాయకులు, జడ్పీ గురించి అవగాహన ఉన్న బయటి వ్యక్తులు కొందరు కలిసి పంచాయతీరాజ్ కమిషనర్‌తో పాటు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. గత నెలలో చేసిన ఫిర్యాదు గురించి తాజాగా బయటికి పొక్కింది. 'స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.8 కోట్లను అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధుల్ని మాజీ సీఈవో తన ఖాతాలో వేసుకున్నారు. రూ.8 కోట్లకు బ్యాంకు ద్వారా వచ్చిన వడ్డీని కూడా లెక్క చూపలేదు. ఎన్నికల నిర్వహణా ఖర్చులకు సంబంధించిన బిల్లులు సక్రమంగా లేవని 2023లో ఆర్థిక శాఖ షోకాజ్ జారీ చేసింది' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. ఎన్నికలు జరగకుండానే నిర్వహణా నిధుల్ని స్వాహా చేశారని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు.

కోడ్ ఉంది గురువా!

● మంత్రి రోజా భర్తతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు



వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల్గొన్న దృశ్యం

నగరి, ఏప్రిల్ 8: నగరి పట్టణ పరిధిలోని కీలపట్టులో సోమవారం మంత్రి రోజా భర్త ఆర్కే సెల్వమణి వైసీపీ తరుఫున చేపట్టిన ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు. 1998 డీఎస్సీలో క్వాలిఫై అయిన వారికి ఇటీవల ఉద్యోగాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా టీచర్ పోస్టు సంపాదించిన ఆయన వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు.

టీటీడీ జేఈవోగా గౌతమి



తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి నియమితులయ్యారు. ఈమేరకు ఈమెను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో గౌతమిని నియమించారు. గౌతమి.. 2007-09 వరకు చిత్తూరు జిల్లాలో ప్రొబేషనరీ అధికారిగా, 2012 వరకు అనంతపురం ఆర్డీవోగా, 2015 వరకు నెల్లూరు డ్వామా పీడీగా, 2019 వరకు టీటీడీ డిప్యూటీ ఈవోగా, 2022 వరకు కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 2023 వరకు తిరుపతి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవోగా, ఆ తర్వాత అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు టీడీపీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 8: సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విభజన అనంతరం రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నపటికీ నవ్యాంధ్ర సీఎంగా నారా చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. వీటితోపాటు రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులనూ చేపట్టిన సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు నాయుడని అని కొనియాడారు. వైసీపీ పాలనలో అభివృద్ధి పరంగా ఎక్కడా ఒక్క ఇటుక కూడా వేయలేదని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. చంద్రబాబు ముందుచూపుతో రాష్ట్రానికి అనేక అంతర్జాతీయ పరిశ్రమలు వచ్చాయని, వీటితో లక్షలాది మందికి ఉపాధి లభించిందని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కొత్తపరిశ్రమలు రాకపోగా ఉన్నవి మూతపడ్డాయన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు చంద్రబాబుకు మాత్రమే సాధ్యమన్నారు. సంపద సృష్టించడంలో, ఆదాయ వనరులను పెంచుకోవడంలో ఆయన సమర్థుడని కొనియాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4 వేలు పింఛన్ ఇవ్వడంతో పాటు ఇసుక ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇపుడు టీడీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయగల శక్తి ఒక్క చంద్రబాబుకే ఉందని అన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నేతలు దొరబాబు, సురేంద్రకుమార్, కోదండయాదవ్, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల



బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండలంలోని జామియా మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి దువా చేశారు. ముస్లింల అభ్యున్నతి పెద్దపీట వేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని దగ్గుమళ్ల అన్నారు. రంజాన్ తోఫా, ఇమాంలు, మౌజన్‌లకు వేతనాలు ఇవ్వడంతో పాటు హజ్ యాత్రకు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. నాయకులు ఎన్‌పీ జయచంద్ర నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్‌రెడ్డి, ఎన్‌పీ ధరణి, ఎన్‌పీ విక్రమ్, హేమచంద్ర నాయుడు, లోకనాథ నాయుడు, జనార్దన్‌గౌడ్, ముస్లిం మైనార్టీ కార్యదర్శి రహంతుల్లా ఖాన్, ముత్తావలి జాకీర్ హుస్సేన్, ఆరీఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి తిరుమల ముస్తాబు

● నేడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం



శ్రీవారి ఆలయం ముందు చిన్నికృష్ణుడి ప్రతిమలు

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఆస్థానం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఆలయంలోని బంగారు వాకిలిలో పండితులు ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగాసుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్, పుష్పాలంకరణలో ఆలయం ప్రత్యేక అందాలతో దర్శనమిస్తోంది. తిరుమల క్షేత్రాన్ని దాదాపు 10 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. ఆలయంలోని ధ్వజస్తంభం, బలిపీఠాన్ని 60 వేల కట్‌ఫ్లవర్లతో అలంకరించారు. ప్రత్యేకించి ఆలయం ముందు రాముడు, మత్స్యావతారం, చిన్నికృష్ణుడితోపాటు పలు అవతారాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. అలాగే యుగాల సెట్టింగులు వేశారు. అద్దాల మండపం వద్ద అయోధ్యరాముడి సెట్టింగ్, నవధాన్యాలతో మత్స్యావతారాన్ని ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేశారు. ఆలయంతోపాటు మహద్వారం గేటుకు మామిడి, చెరకు, అరటి ఆకులతో అలంకరణలు చేశారు.

తిరుమలలో పలుచగానే భక్తులు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. సాధారణంగా ఉగాది పర్వదినానికి రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించలేదు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ పలుచగానే కనిపించింది. ఉదయం 6 గంటల సమయానికి దర్శనానికి డైరెక్ట్ లైన్ ఉండగా, సాయంత్రం 7 గంటల సమయానికి ఎనిమిది కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి 4 గంటల దర్శన సమయం పట్టింది. అలిపిరి టోల్‌గేట్ తోపాటు ఘాట్‌రోడ్లు ఖాళీగానే కనిపించాయి.





వాహనాలు లేక ఖాళీగా ఉన్న ఘాట్ రోడ్డు - ఆలయం ముందు పలుచగా ఉన్న భక్తులు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తవణంపల్లెలో టీడీపీ కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఆర్ రాజన్ తదితరులు

తవణంపల్లె, ఏప్రిల్ 8: మండల కేంద్రం తవణంపల్లెలో టీడీపీ నూతన కార్యాలయాన్ని సోమవారం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, అనంతరం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్ కుమార్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జులు మోహన్ నాయుడు, సునీల్‌కుమార్, మాజీ ఎంపీపీ సరళకుమారి, నాయకులు భాస్కర్ నాయుడు, మధు, జెట్టిపల్లె శ్రీనివాసులు, దాము, గోపి, లవకుమార్, చంద్ర మోహన్, రవి, రఘు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న పోలీసులు



పోలీసులు అడ్డుకోవడంతో చర్చిస్తున్న టీడీపీ నేతలు

గుడిపాల, ఏప్రిల్ 8: మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో సోమవారం సాయంత్రం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ ఎన్నికల ప్రచారానికి రాగా ఎన్నికల అధికారులు, గుడిపాల పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారం కొత్తపల్లిలో నిర్వహించాల్సి ఉండగా, అక్కడ ఓ మహిళ మృతిచెందడంతో ఎన్నికల ప్రచారం వాయిదా పడింది. దీంతో సోమవారం నిర్వహించుకుందామని గురజాల ప్రతిమ కొత్తపల్లి దళితవాడకు చేరుకోగానే పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకోవడంతో వారు తిరుగుముఖం పట్టారు.

మామిడి రైతులకు మద్దతు ధర ఇస్తాం

● పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

ఐరాల, ఏప్రిల్ 8: పూతలపట్టు నియోజకవర్గంలోని మామిడి పంట సాగు చేసిన రైతులకు మద్దతు ధర ఇస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. సోమవారం ఆయన పొలకల పంచాయతీలో గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు నాగేశ్వరచౌదరి, గంగారపు హరిబాబునాయుడు, లత, స్వర్ణ, కొల్లా రమేష్, సోమశేఖర్ నాయుడు, మధుసూదన్‌రావు, శివయ్య, బత్తల సురేంద్ర నాయుడు, బాల సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి భాను పరామర్శ

నింద్ర, ఏప్రిల్ 8: నింద్ర పంచాయతీ, మిట్ట కండిగ్ర గ్రామ పంచాయతీలో సోమవారం మృతి చెందిన శ్రీనివాసన్(45) మృతదేహానికి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి భాను ప్రకాష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు గాలి రమేష్ నాయుడు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హార్వర్డ్‌లో ముందస్తు రంజాన్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 8: స్థానిక రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్ అధ్యక్షతన సోమవారం ముందస్తు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు వచ్చిన ఇమామ్ విద్యార్థులచే ప్రత్యేక ప్రార్థనలు చేయించి, రంజాన్ పండుగ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచండి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 8: ఎండలు రోజురోజుకు పెరుగుతున్నందున పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఎక్కువగా ఉంచాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో పరిధిలో టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఫార్మాసిస్ట్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, డీపీఎంవో రవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అక్కనగారిపల్లె పాఠశాలలో ఉగాది వేడుకలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 8: మండలంలోని అక్కనగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా సోమవారం విద్యార్థులతో కలిసి హెచ్ఎం గంగాధరం ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఉగాది పచ్చడిని అందరికి పంచిపెట్టారు. అంగన్‌వాడీ వర్కర్ సరిత, సీఆర్పీ కుమారి పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న 3 నెలల జీతాలు చెల్లించాలి

నగరి, ఏప్రిల్ 8: నగరి ఏరియా వైద్యశాలలో పనిచేసే కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి ఏరియా వైద్యశాలలో పనిచేసే కార్మికులు సోమవారం ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. ఏరియా హాస్పిటల్ కార్యదర్శి నగోమి మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలివ్వకుంటే కార్మికులు ఎలా జీవించాలని ప్రశ్నించారు. వైద్యశాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా జీతాలు అందేలా చూడాలన్నారు. వేలన్, శాంతి, రూతు, రాజేశ్వరి, ఆశ, అముద, అమ్ములు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆవుదేవర నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 8: వెదురుకుప్పం మండలం చవటగుంటలో ఉన్న ఆవుదేవర నందీశ్వరుడికి సోమవారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అభిషేకాలను నిర్వహించారు. అలాగే డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకం, అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 8: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... తవణంపల్లె మండలం కొత్త గొల్లపల్లి గ్రామానికి చెందిన చిన్నబ్బ(65) కేజీసత్రం వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, పలమనేరు వైపు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆయన మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వళ్ళెమ్మ తెలిపారు.

పెళ్లి చేసుకుని యువతిని మోసంచేసిన యువకుడు, కుటుంబ సభ్యుల అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 8: ప్రేమించానంటూ వెంటపడి పెళ్లి చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి చివరకు పెళ్లికి అంగీకరించిన ఆ యువతిని అత్తగారింటికి తీసుకెళ్లిన ఆ యువకుడు తన తల్లిదండ్రులకు అమ్మాయి నచ్చకపోవడంతో చిత్రహింసలకు గురిచేసి రోడ్డుపై వదిలేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. దీంతో గత నెల 18వ తేదీన శేషాపురం గ్రామానికి చెందిన బాబు కుమార్తె యమున పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ కేసులో విచారణ చేపట్టిన పోలీసులు మోత కుంట గ్రామానికి చెందిన అభిరామ్, అతడి తల్లిదండ్రులు నాగభూషణమ్మ, శేఖర్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 8: రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... నగరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం నాయుడు ద్విచక్ర వాహనంలో సోమవారం చిత్తూరు నుంచి నగరికి విధుల కోసం వెళ్తుండగా మార్గమధ్యంలో ఎస్ఆర్‌పురం మండలం చిన్న తయ్యూరు గ్రామం వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై అదుపు తప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయనను 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీడీపీని ఆదరించండి

పూతలపట్టు, ఏప్రిల్ 8: రాష్ట్రంతో పాటు ప్రజలు బాగుండాలంటే టీడీపీనే గెలిపించాలని వడ్డేపల్లి ఎంపీటీసీ విజయలక్ష్మి కోరారు. సోమవారం ఆమె వడ్డేపల్లి, కమ్మగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రచారం చేశారు.

డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం



పొగలు కమ్మిన డంపింగ్ యార్డు

చిత్తూరు, ఏప్రిల్ 8: నగరపాలక సంస్థ డంపింగ్ యార్డులో సోమవారం ప్రమాదశాత్తు మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన డంపింగ్ యార్డుకు వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా మంటలు ఆగలేదు. డంపింగ్ యార్డులో మంటలకు పెద్ద ఎత్తున పొగ నాలుగైదు కిలోమీటర్ల వరకు కమ్ముకుంది. సమీపంలో ఉన్న మంగసముద్రం, లెనిన్‌నగర్, విజయలక్ష్మీకాలనీ, కొత్తూరు, ఓబనపల్లె, సంతపేట, ఇందిరమ్మకాలనీ, పత్రాంపల్లె తదితర కాలనీలకు పొగ వ్యాపించింది. దాంతో కాలనీవాసులు ఇళ్లల్లో ఉండలేకపోయారు. చిన్నపిల్లలు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది డంపింగ్‌యార్డుకు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. కమిషనర్ అరుణ, ప్రజారోగ్యశాఖ అధికారులు డంపింగ్‌యార్డుకు చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. మంటలు వ్యాపించకుండా చెత్తను తడిపేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



ఓబనపల్లె కాలనీ వాసులతో మాట్లాడుతున్న గురజాల

పరిశీలించిన గురజాల

చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఓబనపల్లె కాలనీలో అగ్ని ప్రమాదం జరిగిన మునిసిపల్ డంపింగ్ యార్డును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ అరుణతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు.

కమిషనర్ నిర్లక్ష్యమే కారణం: సీపీఐ

చిత్తూరు రూరల్: డంపింగ్ యార్డు కాలడానికి, లెనిన్ నగర్ హౌసింగ్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడటానికి నగర కమిషనర్ నిర్లక్ష్యమే కారణమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు విమర్శించారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానికులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు చుట్టుపక్కల నిరుపేదలు నివసిస్తున్నారని, డంపింగ్ యార్డు కాలిన ప్రతీసారి స్థానిక ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి మార్చాలని సీపీఐ అనేక పోరాటాలు చేసినా కమిషనర్ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని కోరారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, మణి, జయ శంకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల రోజాకు ప్రజలే గుణపాఠం చెబుతారు

- గాలి భానుప్రకాష్



సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 8: నగరి నియోజకవర్గంలో కమీషన్ల రోజాకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కూటమి సమన్వయకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గం వడమాలపేట మండలంలో పాదిరేడు వద్ద టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో మంత్రి రోజా ఎకరాకు 4 నుంచి 20 లక్షల రూపాయల వరకు కమీషన్ దండుకున్నారని విమర్శించారు. వైసీపీ వారు చేసిన అన్యాయాలను, అక్రమాలను గుర్తుపెట్టుకుని తగిన గుణపాఠం చెబుతామన్నారు. టీడీపీ నాయకులపై పెట్టిన తప్పుడు కేసులను తిరగదోడతామన్నారు. అన్యాయంగా కేసులు పెట్టిన పోలీసులను సైతం వదిలేది లేదని హెచ్చరించారు. 30రోజులపాటు టీడీపీ నాయకులు, కూటమి నాయకులు ఇదే ఉత్సాహంతో పనిచేస్తే విజయం సులభమని తెలిపారు. టీడీపీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, పుత్తూరు పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, దశరథవాసు, షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ బాలాజీ, మహిళా అధికార ప్రతినిధి మీరా, లక్ష్మీప్రసన్న, కృష్ణారెడ్డి, రుక్కుం బాలాజీ, గుణశేఖర్, జ్యోతి నాయుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి రమేష్ నాయుడు. రామ్మూర్తి యాదవ్, జనసేన నాయకులు మెరుపుల మహేష్, దేవా పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



భానుప్రకాష్‌తో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

విజయపురం, ఏప్రిల్ 8: మండలంలోని కేవీశ్రీరామాపురానికి చెందిన వైసీపీ నాయకుడు దాసరి మోహన్ నాయుడు, ఆయన అనుచరులు సోమవారం తిరుపతిలో నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. భానుకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

నేడు క్రోధి నామ తెలుగు సంవత్సరాది

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 8: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను మంగళవారం నగరవాసులు జరుపుకోనున్నారు. ఈసందర్భంగా నగరంలోని బజార్లన్నీ పండుగ సరుకులు కొనడానికి వచ్చిన ప్రజలతో రద్దీగా మారాయి. మామిడి ఆకులు, కాయలు, పూలు, పండ్లు, స్వీట్స్, నూతనవస్త్రాలు కొనుగోలు చేయడానికి ప్రజలు ఎగబడ్డారు. ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

కార్వేటినగరం, ఏప్రిల్ 8: అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద తమిళనాడు పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించి వాహనాలను ఆంధ్ర ప్రాంతంలోకి అనుమతిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా డబ్బులు అక్రమ రవాణా చేసే అవకాశం ఉందన్న కారణంతో కార్లను క్షుణ్ణంగా తనిఖీ చేసే వదిలిపెడుతున్నారు. ఆంధ్ర పోలీసులు కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

● చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్



కరపత్రాలు అందచేస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 8: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం నగరంలోని 22, 26, 43, 44 డివిజన్ల పరిధిలోని తేనెబండ, శ్రీనివాసపురం, గంగాకాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, వీరభద్రకాలనీ, మార్కెట్ చౌక్, బజారువీధి, చావిడి వీధి, రాములవారి గుడివీధి, బ్రాహ్మణవీధి, అంబేద్కర్ నగర్, బాలాజి కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గురజాల మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించిన పాలన ఇంతవరకు విధ్వంసంతోనే కొనసాగుతోందని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పాలనలో రాష్ట్రాన్ని ప్రపంచ దేశాలు గుర్తించే స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. కాని వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ళ వెనక్కి వెళ్లిందని విమర్శించారు. జగన్ పాలనలో అనేక రకాల పన్నుల మోత, నిత్యావసర ధరల పెరుగుదల, పెట్రోల్, డీజల్, విద్యుత్ ఛార్జీల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రాన్ని బాగు చేయాలంటే చంద్రబాబు ఒక్కరికే సాధ్యమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, వసంత్‌కుమార్, బీజేపీ నేతలు దయారాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 8: టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. సోమవారం తెలుగు మహిళలతో కలసి మురకంబట్టులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మహిళాభివృద్ధికి అనేక సంక్షేమపథకాలుప్రవేశపెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక పథకాలను రద్దుచేసి మహిళలను ఆర్థికంగా బలహీన పరిచిందని అన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కార్జాల అరుణ

పెనుమూరు, ఏప్రిల్ 8: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఎలా చేయాలో అని విజనరీ లీడర్ టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలుసునని చిత్తూరు పార్లమెంటు టీడీపీ మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. సోమవారం మహిళా నాయకురాళ్లతో కలిసి పెనుమూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజన్ 2024లో భాగంగా చంద్రబాబుకు రాష్ట్రంలో సంపద సృష్టించడం ఎలాగో తెలుసని, ఆ సంపదని అభివృద్ధికి ఎలా ఖర్చు చేయాలో కూడా తెలుసని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నిరుద్యోగ భృతి రూ.3వేలు అందిస్తామని చెప్పారు. టీడీపీ చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అమరావతిని నాశనం చేసి, రాజధానికి భూములిచ్చిన రైతులను కక్షపూరితంగా ఇబ్బందిపెట్టారని విమర్శించారు. జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాధమ్మ, సెక్రటరీ భువనమ్మ, అనురాధా, లోకమ్మ, రమణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసు శాఖ అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 8: జిల్లాలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన ఎస్పీ జాషువా చేసిన కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి కనీసం కౌన్సెలింగ్ నిర్వహించకుండా 150 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లను చిత్తూరు సబ్ డివిజన్‌లో బదిలీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. కేవలం అధికార పార్టీ నేతలను సంతృప్తి పరచడానికి పోలీస్ సిబ్బంది జీవితాలతో చెలగాటమాడటం దారుణమన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, సునీల్ చౌదరి, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులచే మామిడి, కొబ్బరి చెట్ల నరికివేత



బంగారుపాళ్యం, ఏప్రిల్ 8: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ, కొత్తపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం, లోకేశ్వర్, క్రిష్ణయ్యలకు 172 మొగిలివెంకటగిరి రెవెన్యూలో కొంతమేర భూమి ఉంది. సుబ్రహ్మణ్యంకు చెందిన భూమిలో 30 మామిడి చెట్లు, 20 కొబ్బరి చెట్లను, లోకేశ్వర్‌కు చెందిన 60 మామిడి చెట్లను, 20 కొబ్బరిచెట్లను, క్రిష్ణయ్యకు చెందిన 30 మామిడి చెట్లు, 10 కొబ్బరి చెట్లను రాత్రివేళలో గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. రైతులు తమ పొలాల వద్దకు ఉదయం వెళ్లిచూడగా గత మూడేళ్లు పెంచిన మామిడి చెట్లు నేలకు ఒరిగి ఉండటంతో దిగాలు పడ్డారు. రైతులు పొలంలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేశారు. కొత్తపల్లికి చెందిన మహేంద్ర, చరణ్‌లపై అనుమానంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

యాదమరి, ఏప్రిల్ 8: మండలంలోని కోణాపల్లె పంచాయతీ పరిధిలో ఉపాధి హామి పనులు చేస్తున్న కూలీలకు డ్వామా పీడీ రాజశేఖర్, ఏడీ గంగాభవాని సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచి పెట్టారు. ఎండ తీవ్రత వల్ల ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే పనులు చేసుకోవాలని, ఆ తరువాత ఇళ్లల్లోనే ఉండాలన్నారు. ప్రభుత్వం రూ.300 వేతనం పెంచిందని కూలీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కొమ్మేపెల్లమ్మ ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

యాదమరి, ఏప్రిల్ 8: మండల పరిధిలోని కృష్ణంపల్లె పంచాయతీ నడిమూరు సమీపంలో వెలసిన కొమ్మేపెల్లమ్మ అమ్మవారి ధ్వజారోహణ కార్యక్రమం వైవవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగలో మూడు రకాల కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణంపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, గ్రామస్తులు పద్మనాభరెడ్డి, జగన్నాధరెడ్డి, నటరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే టీడీపీ లక్ష్యం



ఐఆర్ కండ్రిగలో ఇంటింటికి కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, ఏప్రిల్ 8: సూపర్ సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందని జిల్లా ఎస్సీసెల్ మాజీ అధ్యక్షులు తంగరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ఐఆర్ కండ్రిగ, కొప్పేడు దళితవాడ, వేదాంతపురం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవియాదవ్, రమేష్, సుబ్రమణ్యం, మునస్వామిరెడ్డి, కైలాసశెట్టి, గోపిరెడ్డి, గిరిరెడ్డి, రాంప్రసాద్, సుబ్బురెడ్డి, జనసేన నాయకులు శివలింగం, జయప్రకాష్, బీజేపీ నాయకులు రమేష్, బాలకృష్ణ, వేణు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ కరపత్రాల పంపిణీ

విజయపురం, ఏప్రిల్ 8: మండలంలోని ఇళ్లత్తూరులో మండల టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ కరపత్రాలను సోమవారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, వైసీపీ హయాంలో రోడ్లపై పిడికెడు మట్టి కూడా చల్లలేదని విమర్శించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగుమహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు మునిభాస్కర్‌రాజు, సుధాకర్‌రాజు, శ్రీనివాసులురాజు, సుబ్రమణి, మణి, ఏళుమలై, దశరథరాజు, ధాము, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎపిక్‌కార్డు లేకున్నా ఓటు వేయవచ్చు

నగరి, ఏప్రిల్ 8: ఓటరు గుర్తింపుకార్డు అభ్యం కాని సందర్భంలో ఓటును వినియోగించుకోవడం మరింత సులభతరం చేయడానికి ప్రత్యామ్నాయంగా ఫొటో గుర్తింపుకార్డుల్లో ఏదో ఒక దానిని తీసుకెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవచ్చని నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎపిక్‌కార్డు లభ్యంకాని సమయంలో ప్రత్యామ్నాయంగా ఆధార్‌కార్డు, ఉపాధిహామీజాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్‌కు చెందిన ఫొటోతో వున్న పాసు పుస్తకాలు, కార్మికశాఖ మంత్రిత్వశాఖచే జారీ చేయబడిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డ్, డ్రైవింగ్‌లైసెన్సు, పాన్‌కార్డులలో ఏదేని ఒకటి తీసుకువచ్చి ఓటు వేసే వెసులుబాటు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఐఎన్‌టీఎస్‌లో చైతన్య విద్యార్థుల ప్రభంజనం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 8: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో స్థానిక శ్రీచైతన్యలోని 281 మంది విద్యార్థులు సత్తా చాటినట్లు ఏజీఎం సురేష్ తెలిపారు. లెవల్ 2లో ప్రతిభ చూపిన విద్యార్థులు సోమవారం పాఠశాలలో తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ కిషోర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెరిట్ సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రధర్, ప్రిన్సిపాల్ సాగరిక, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయం సీబీఎస్ఈలో ఘనంగా స్నాతకోత్సవం



పద్యాలు చెబుతున్న చిన్నారి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 8: స్థానిక సుందరరాజపురంలోని విజయం సీబీఎస్ఈ పాఠశాలలో విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజా మూర్తి అధ్యక్షతన సోమవారం యుకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముస్తాబై ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయం కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం నాయుడు విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగమని శైలజామూర్తి పేర్కొన్నారు. విద్యార్థుల గేయాలు, కథలు, పద్యాలు, నాటికలు, ఆటపాటలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాకో రూల్.... వైసీపీకి మరో రూలా...?

● టీడీపీ నేతల విమర్శ



వసంతాపురంలో ఇంటికి వైసీపీ స్టిక్కర్ ఉన్న దృశ్యం

గుడిపాల, ఏప్రిల్ 8: మండలంలోని పలుచోట్ల వైసీపీ స్టిక్కర్లను ఇళ్లకు అతికించి నెలలు గడుస్తున్నా సంబంధిత ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, టీడీపీ సీనియర్ నాయకుడు వాసుదేవరెడ్డి విమర్శించారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ మండలంలోని వసంతాపురంలో కొన్ని ఇళ్లకు వైసీపీ స్టిక్కర్లు అతికించి నెలలు అయినా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత సంబంధిత పంచాయతీ కార్యదర్శికి, వీఆర్‌ఏకి చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే ఆ స్టిక్కర్లు తొలగించాలని, లేనిపక్షంలో ఈసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

20 మంది వలంటీర్ల రాజీనామా

నింద్ర, ఏప్రిల్ 8: నింద్ర సచివాలయానికి చెందిన 20 మంది వలంటీర్లు సోమవారం ఉదయం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేశారు. వారు మాట్లాడుతూ జగనన్న రుణం తీర్చుకోవడానికి జగనన్న సైనికులుగా పనిచేస్తామని తెలిపారు. ఎన్నికల పేరుతో తమను సంక్షేమ పథకాలకు దూరంగా పెట్టడం బాధాకరమని తెలిపారు.

పాతార్కాడులో...

విజయపురం, ఏప్రిల్ 8: మండలంలోని పాతార్కాడులో ముగ్గురు వలంటీర్లు గిరిజ, సరళ, రాజకుమారి తదితరులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందించారు. వలంటీర్లపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు పెట్టడంతో రాజీనామా చేసి ఎన్నికల్లో స్వచ్ఛందంగా పాల్గొంటామన్నారు.